సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 26 । ఆగస్టు । 2024



నో స్టాక్

టెక్కలి, అంగూరు ఇసుక స్టాక్ పాయింట్లలో ఇసుక అయిపోయింది. అధికారిక ఇసుక విక్రయాలు నిలిచిపోయాయి. - 8లో



వేతనం కోసం..

జీఆర్‌ఏయూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. మంత్రికి కూడా విన్నవించారు. - 8లో

నేడు 'మీ కోసం' రద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నేడు నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) వినతుల స్వీకరణ కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు తెలిపారు. కృష్ణాష్టమి పండగ ప్రభుత్వ సెలవు దినం సందర్భంగా వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించడం లేదని తెలిపారు. ఎస్పీ గ్రీవెన్స్ కూడా రద్దు చేశారు.

న్యూస్‌రీల్

31 వరకు క్రీడా దినోత్సవాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి 31వ తేదీ వరకు క్రీడా దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు తెలిపారు. శాప్ ఆదేశాలు, కలెక్టర్ సూచనల మేరకు క్రీడోత్సవాల్లో భాగంగా ఈనెల 27వ తేదీన 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారికి మూడు విభాగాలుగా వేరు చేసి వివిధ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 28వ తేదీన కూడా వివిధ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలు శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంతోపాటు రణస్థలం, టెక్కలి, పాతపట్నం, ఆమదాలవలస క్రీడా వికాస కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొంది మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి 29వ తేదీన ప్రజాప్రతినిధులు, అధికారుల చేతులమీదుగా బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అలాగే ఈ నెల 29వ తేదీన క్రీడాదినోత్సవ ర్యాలీని శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్టు డాక్టర్ శ్రీధర్ వెల్లడించారు. శ్రీకాకుళం వైఎస్సార్ సర్కిల్ నుంచి కేఆర్ స్టేడియం వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందన్నారు.

పశువుల అక్రమ రవాణా



పోలీసులు పట్టుకున్న బొలెరో వాహనంలో తరలిస్తున్న మూగజీవాలు

టెక్కలి రూరల్: టెక్కలి సమీప జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం మూగజీవాల అక్రమ తరలింపును టెక్కలి పోలీసులు అడ్డుకున్నారు. పలాస నుంచి శ్రీకాకుళానికి 5 గేదె పెయ్యలు, 3 గేదెలతో మొత్తం 8 మూగజీవాలను తీసుకువెళ్తున్న బొలేరో వ్యాన్‌ను అదుపులో తీసుకున్నారు. అనంతరం ఆ వ్యాన్‌ను స్టేషన్‌కు తరలించారు. ఈ పశువులను గొదలాం వైపు తీసుకువెళ్తున్నామని ఈ పశువులు రైతులకు సంబంధించినవి చెబుతున్నట్లు తెలిపారు. అయితే పూర్తిగా విచారణ జరిపిన అనంతరం కేసు నమోదు చెయ్యనున్నట్లు టెక్కలి పోలీసులు తెలిపారు.

బస్‌షెల్టర్‌కు పసుపు రంగు



ప్రయాణికుల విశ్రాంతి భవనానికి పసుపు రంగు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో కొన్నేళ్ల కిందట నిర్మించిన ప్రయాణికుల విశ్రాంతి భవనానికి ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పసుపు రంగు వేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆ విశ్రాంతి భవనానికి పసుపు రంగు వేశారు. ఎన్నో ఏళ్ల కిందట ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలకు పార్టీ రంగులేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నీట్ పీజీలో మెరిసిన చైతన్య



పలాస: పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన దంతం చైతన్య నీట్ పీజీ పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో 86వ ర్యాంకు సాధించాడు. ఈ ఏడాది ఆగస్టు 11న జరిగిన పరీక్షలో తన సత్తా చాటాడు. అతని తండ్రి ఈశ్వరరావు మెళియాపుట్టి మండలం గొప్పిలి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తల్లి శ్యామల గృహిణి.

చెన్నైలో వలస మత్స్యకారుడు మృతి

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు మత్స్యకార గ్రామానికి చెందిన బుడ్డ రాజారావు(44) అనే యువకుడు చెన్నైలో చేపల వేటకు వెళ్లి చనిపోయాడు. రాజారావు రెండు నెలల కిందట చెన్నై వలస వెళ్లాడు. అక్కడే స్నేహితులతో కలసి సముద్రంలో వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఐదు రోజుల కిందట స్నేహితులతో కలసి సముద్రంలోకి చేపల వేటకు వెళ్లిన రాజారావు నడి సముద్రంలో తీవ్ర అస్వస్థతకు గురై బోటులోనే మృతి చెందాడు. ఈ విషయాన్ని స్నేహితుల ద్వారా డొంకూరుకు ఆదివారం రాత్రి సమాచారం అందడంతో గ్రామస్తులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. బోటు సోమవారం ఉదయం ఒడ్డుకు చేరితే శవ పంచనామా అనంతరం చెన్నై నుంచి మృత దేహాన్ని తీసుకువస్తామని గ్రామ పెద్దలు చెబుతున్నారు. మృతుడికి భార్య పుష్పతో పాటు నలుగురు ఆడ పిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు.



రక్షణ కరువైతే ఎలా..?

మహిళలపై హత్యాచారాలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. ప్రాణాలు పోసే డాక్టర్లు, సిబ్బందికే రక్షణ కరువైతే ఎలా..? కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన దేశం మొత్తాన్నీ కుదిపేసింది. రాత్రి సమయంలో మహిళలకు భద్రత కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. ఆసత్రిలో రాత్రులు రక్షణ అవసరం. - జె.హానిషా, స్టాఫ్‌నర్సు, పీహెచ్‌సీ ఆస్పత్రి, పాతపట్నం

భద్రతా చాలా అవసరం..



వృత్తి రీత్యా ఎంతో మంది మహిళా వైద్యులు, వైద్యసిబ్బంది ఒంటరిగానే విధులకు వస్తుంటారు. వీరికి భద్రత చాలా అవసరం. వీరికి రక్షణ కల్పించాలంటే స్థానిక ప్రజల సహకారం చాలా ముఖ్యం. మహిళా వైద్యులు, వైద్యసిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించే వారిని కూడా చట్టరీత్యా కఠినంగా శిక్షించాలి. - డాక్టర్ టి.శిల్ప, చిన్నపిల్లల వైద్యురాలు, సీహెచ్‌సీ ఇచ్ఛాపురం



రక్షణ కావాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం హేయమైన చర్య. విధుల్లో ఉన్న మహిళా వైద్య సిబ్బందికి రక్షణ అవసరం. మండలాల్లో కూడా రాత్రి సమయంలో వైద్యులు, ఇతర సిబ్బంది విధుల్లో ఉంటున్నారు. ఆస్పత్రికి రాత్రి సమయాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలి. ఆస్పత్రి వ్యవస్థలో మార్పులు రావాలి. - డాక్టర్ జి.అనిత, గైనకాలజిస్ట్, సీహెచ్‌సీ, పాతపట్నం

సామాన్యుడికి సీజనల్ సవాల్



నగటు సిక్కోలు జీవి చితికిపోతున్నాడు. **నెల సంపాద**నంతా పక్షం రోజులకే సరిపోయి.. **మరో పక్షా**నికి అప్పు చేసే అతి సామాన్యుడు **మనిషి మా**మూలు జ్వరానికి కూడా నిలువెల్లా **వణికిపోతు**న్నాడు. ప్రభుత్వ ఆస్పత్రుల క్యూ**లో నించోలేక,** ప్రైవేటు ఆస్పత్రుల్లో టెస్టుల ఖర్చు **భరించలేక నరకయాత**న పడుతున్నాడు. ఊరూరా జడలు **విప్పుతున్న 'సీజనల్' భూతానికి** అడ్డంగా దొరికిపోయి విలవిలలా**డిపోతున్నాడు. ఆస్పత్రుల్లో పెరుగుతు**న్న ఓపీ లైన్లు, వార్డుల్లో కనిపిస్తున్న **దయనీయ దృశ్యాలు జిల్లా పరిస్థితికి అద్దం** పడుతున్నాయి.



శ్రీకాకుళంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంఎం వార్డులో జ్వరాలతో బాధపడుతున్న రోగులు

అరసవల్లి:

- జ్వరాలతో ఆస్పత్రులన్నీ కిటకిట
- ఐదుకు చేరిన జ్వరాల మృతుల సంఖ్య
- అధిక సంఖ్యలో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు
- నామమాత్రంగా ప్రభుత్వ చర్యలు

జిల్లాకు ఏదో శాపం పట్టుకున్నట్టు ఉంది. ఎన్నడూ లేని విధంగా జ్వర బాధితులతో ఊళ్లన్నీ వణికిపోతున్నాయి. కేవలం వైద్యారోగ్య శాఖ అధికారుల లెక్కల ప్రకారం చూసినా.. జిల్లాలో జ్వర బాధితుల సంఖ్య ఏకంగా 64 వేలకుపైగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఎక్కడైనా అనారోగ్య పరిస్థితులు బయటపడి, గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తితే వెంటనే సంబంధిత జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు హడావుడి చేసి క్యాంపులంటూ, వైద్య సేవలంటూ క్రింద స్థాయి సిబ్బందికి, వైద్యులకు పరుగులు పెట్టించి ఆ తర్వాత ఎలాంటి ఫాలోఅప్ లేకుండా వదిలేస్తున్నారు. ఇటీవల జి.సిగడాం మండలం మెట్టవలసలో డయేరియా వ్యాధులతో గ్రామమంతా మంచాన పడటంతో జిల్లా అధికార యంత్రాంగం హడావుడి చేసి అంతా ఒకటిరెండు రోజుల్లోనే పారిశుద్ధ్య పరిస్థితులను మార్చేసే ప్రయత్నం చేసి ఆ తర్వాత మిన్నకుండిపోయింది. ప్రభుత్వం కూడా దీన్ని సీరియస్‌గా తీసుకుంటున్నట్లు కనిపించడం లేదు. ఈ జ్వరాలు సామాన్యుల ఆర్థిక పరిస్థితులను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. కేవలం రక్తపరీక్షలు, ప్లేట్‌లెట్స్ పరీక్షల కోసమే వేలాది రూపాయలు చెల్లించాల్స వస్తోంది. జిల్లా కేంద్రంతో పాటు టెక్కలి, నరసన్నపేట, పలాస, పాతపట్నం, ఆమదాలవలస తదితర ప్రాంతాల్లో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. స్థానిక జనరల్ ఆస్పత్రిలో అయితే ఐదారు వందల బెడ్లు కేవలం జ్వరాలతో నిండిపోవడంతో పాటు రోజుకు కనీసంగా ఆరు వందల వరకు ఓపీ నమోదవుతోంది.



శ్రీకాకుళం బ్యాంకర్స్ కాలనీలో చెత్తతో కూరుకుపోయిన కాలువలు

ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త పరీక్షలు చేయించుకుని అంతా నిర్ధారణ అయిన తర్వాత చాలా మంది రోగులు స్థానికంగా ప్రభుత్వ వైద్యం నచ్చక ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు.

వైద్యారోగ్య శాఖ లెక్కల ప్రకారం..

- జిల్లాలో ఇప్పటివరకు 2 లక్షల మందికి వైద్య పరీక్షలు, జ్వర నిర్ధారణ పరీక్షలను అధికారికంగా నిర్వహించగా.. మరో లక్ష మందికి ప్రైవేటు ఆస్పత్రుల్లో నిర్ధారణ చేయించుకున్నారు.
- మొత్తంగా తాజాగా 64 వేల మంది వరకు రోగులకు జ్వర పీడితులున్నట్లుగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ మీనాక్షి వెల్లడించారు.
- వీరిలో 63,932 మందికి సీజనల్ జ్వరాలు కాగా, ఇందులో డయేరియాతో 3113 మంది, టైఫాయిడ్‌తో 196 మంది, మలేరియాతో 30 మంది, డెంగీ లక్షణాల జ్వరాలతో 25 మంది బాధ పడుతున్నట్లు అధికారికంగా లెక్కలున్నాయి.
- ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ సంఖ్య మరింత ఎక్కువ మంది ఉన్నట్లుగా తెలుస్తోంది.
- ఇప్పటికే సరుబుజ్జిలి, పాతపట్నం, ఎచ్చెర్ల, టెక్కలి, కోటబొమ్మాళి తదితర ప్రాంతాల్లో కేవలం జ్వరాలతో, వివిధ సీజనల్ వ్యాధులతోనే మృతి చెందిన ఘటనలు చోటుచేసుకున్నాయి.



ఇచ్ఛాపురం: బెల్లుపడ కాలనీలో కాలువ పరిస్థితి

● ఓపీ కిటకిట..

జిల్లాలో ఏ ఆస్పత్రి చూసినా జ్వర బాధితులే కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో చూస్తే రిమ్స్, జనరల్ ఆస్పత్రితో పాటు జెమ్స్, ఇతరత్రా ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల ఓపీలన్నీ బిజీగా కనిపిస్తున్నాయి. ఇందులో సామాన్య, మధ్యతరగతి వారే అధికంగా ఉన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఈ ఓపీలే సమోదవుతుంటే.. వీరికి ట్రీట్‌మెంట్ కూడా పూర్తిస్థాయిలో అందించకుండా సాధారణ జ్వర మందులను ఇచ్చేసి పంపించేసే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక టెక్కలి జిల్లా ఆస్పత్రి, నరసన్నపేట ఏరియా ఆస్పత్రిలో కూడా దాదాపుగా ఇదే పరిస్థితి నెలకొంది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో చాలా చోట్ల వైద్యులు కూడా నిర్లక్ష్యంగానే విధులను నిర్వర్తిస్తున్నారు.



కొత్తూరు ఆస్పత్రిలో ఓపీ వద్ద క్యూ కట్టిన జనం

మీటింగ్‌లతోనే కాలక్షేపం

ఓ వైపు జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులతో జనమంతా ఇబ్బందులు పడుతుంటే సంబంధిత వైద్య శాఖాధికారులు మాత్రం క్షేత్ర స్థాయి పరిస్థితులను పర్యవేక్షించడం లేదు. వరుసగా గంటల కొద్దీ సమీక్షలు, సమావేశాలతో పాటు వీడియో, టెలీ కాన్ఫరెన్స్‌లతో వైద్యాధికారులు బిజీగా మారిపోవడంతో క్షేత్ర స్థాయిలో వైద్యులు ఎలా విధులు నిర్వర్తిస్తున్నారో అన్నది తెలియకుండాపోతోంది. ప్రాథమిక కేంద్రాల్లో మందుల కొరత, వైద్యుల్లో లోపించిన సమయ పాలన, ప్రైవేటు ఆస్పత్రుల్లో కొరవడిన పర్యవేక్షణ తదితర అంశాలేవీ రాష్ట్ర సర్కార్ ప్రాధాన్యతగా తీసుకోవడం లేదనే చర్చ జరుగుతోంది.



ఇచ్ఛాపురం జంక్షన్‌లో నిత్యం ఇదే పరిస్థితి

- కంచిలి: కంచిలి పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ లాభాల కామరాజు కుమార్తె ఆరేళ్ల ఝాన్సీ గడచిన 15 రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతోంది. చివరికి ప్లేట్‌లెట్లు పూర్తిగా తగ్గిపోయి అపస్మారక స్థితికి చేరి, ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతోంది. జ్వరం తీవ్రమవ్వడంతో శనివారం చిన్నారిని శ్రీకాకుళంలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ఆదివారం విశాఖపట్నంలో గల ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మెరుగైన చికిత్స కోసం చేర్పించారు.
- సోంపేటకు చెందిన ఒక వ్యక్తికి జ్వరం రావడంతో ప్లేట్‌లెట్స్ 10వేలకు పడిపోయాయి. ప్లేట్‌లెట్స్ మెరుగవ్వడం కోసం చేసిన చికిత్స వికటించి, గుండెలోసమస్యకు దారితీసింది. దీంతో హుటాహుటిన కార్డియాలజిస్టును సంప్రదించి, చికిత్స చేయించడంతో ప్రస్తుతం ఆరోగ్యం కొంతవరకు కుదుటపడింది.



విశాఖలో ప్రైవేటు ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న చిన్నారి లాభాల ఝాన్సీ



కంచిలి పీహెచ్‌సీలో జ్వర బాధితులకు చికిత్స చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగేంద్ర

ఎరువుల డీలర్లపై ఎందుకంత వివక్ష?




మాట్లాడుతున్న జిల్లా ఎరువులు, విత్తనాలు, పురుమందుల డీలర్ల అసోసియేసన్ నాయకులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన ఎరువుల డీలర్లపై ఫెర్టిలైజర్ కంపెనీలు వివక్ష చూపుతున్నాయంటూ జిల్లా ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్ల అసోషియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాడ సూర్యనారాయణ అధ్యక్షతన స్థానిక రైస్‌మిల్లర్ల అసోసియేషన్ భవనంలో ఆదివారం జరిగిన ఈ సమావేశంలో ప్రధానంగా పలు అంశాలను తెలియజేశారు. జిల్లాకు వచ్చిన సబ్సిడీ ఎరువులో 50శాతం(ఒక్కోసారి అంతకు మించి) ప్రభుత్వ ఆధీనంలోని మార్క్‌ఫెడ్, ఆర్‌ఎస్‌కే, పీఏసీఎస్‌లకు పంపిణీ చేస్తున్న సమయంలో వారితో సమానంగా ప్రైవేట్ ఎరువుల డీలర్లకు ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యంలో కంపెనీలు వివక్ష చూపుతున్నాయని మండిపడ్డారు. అలాగే ఎరువులతోపాటు లింక్ పెడుతున్న మైక్రో న్యూట్రిన్స్, నానోలిక్విడ్స్ తోపాటు ఇతర ఉపఉత్పత్తులు సైతం వారితో సమానంగా షేర్ చేయాలని డిమాండ్ చేశా రు. అలా కాకుండా కేవలం ప్రైవేట్ వర్తకుల వద్ద మాత్రమే లింక్ ప్రొడక్ట్స్ అమ్మకాలు చేస్తే వినియోగదారులైన రైతులు డీలర్లను విలన్లుగా, దోపిడీదారులుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలకు అనుగుణంగా రాయితీ ఎరువుల్లో మార్పులు, మారుతున్న పద్ధతులపై విస్తృతమైన ప్రచారం కల్పించాల్సిన బాధ్యత సైతం కంపెనీలదేనని పేర్కొన్నారు. బస్తాపై స్థానికంగా హమాలీ కోసం 15 నుంచి 20 రూపాయ లు అదనంగా చెల్లిస్తున్న నేపథ్యంలో ఎంఆర్‌పీ ధరలకు విక్రయిస్తే బస్తాకు 30 నుంచి 50 రూపాయలు వరకు నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. దీనిపై వ్యవసాయశాఖ మంత్రితో పాటు ప్రభుత్వానికి కూడా తమ సమస్యలను తెలిపామన్నారు. సమావేశంలో జిల్లా అసోసియేసన్ సెక్రటరీ వైశ్యరాజు గోవిందరాజు, సభ్యులు ధోని కొండలరావు, బోయిన గోపాలక్రిష్ణమూర్తి, పొట్నూరు శ్రీరాములు పాల్గొన్నారు.

టెక్కలి ఆస్పత్రిలో పనిచేయని లిఫ్ట్

టెక్కలి రూరల్: టెక్కలి జిల్లా ఆస్పత్రిలో లిఫ్ట్ పనిచేయడం లేదు. జనసేనకు చెందిన కురాకుల యాదవ్ మరో ఇద్దరు యువకులతో కలసి ఆదివారం సాయంత్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శించేందుకు వచ్చారు. రెండో ఫ్లోర్‌లో ఉన్న వ్యక్తిని పరామర్శించి లిఫ్ట్‌లో కిందకు వస్తుండగా ఒక్కసారిగా లిఫ్ట్ మధ్యలో ఆగిపోయింది. ఎంతసేపటికీ ఎవరూ స్పందించకపోవడంతో కొమ్ము హర్షవర్ధన్ అనే వ్యక్తి ఊపిరాడక సతమతమైపోయాడు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేశాక ఎవరో ఒక వ్యక్తి వచ్చి లిఫ్ట్ తాళాలు తీసి వారికి బయటకు తీసుకువచ్చారు.

దాదాపు ముప్పై నిమిషాలు యాతన పడ్డామని, ఎవరైనా రోగికి ఇదే పరిస్థితి ఎదురైతే ఎవరు బాధ్యులని వారు ప్రశ్నించారు.





● బాలుడా.. గోపాలుడా.. లోకాల పాలుడా

శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నరసన్నపేటలోని సూక్ష్మ కళాకారుడు వీరమల్లు శివనాగ నరసింహాచారి పెన్సిల్ ముల్లుపై రాధాకృష్ణుల బొమ్మని చెక్కి ఔరా అనిపించుకున్నారు. శ్రీకాకుళంలోని ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక నృత్య ప్రదర్శనలు చేశారు.

- నరసన్నపేట, శ్రీకాకుళం కల్చరల్



తండ్రిని హత్తుకుని చనిపోయిన కుమారుడు

దారి కాచిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు దుర్మరణం
- తండ్రిని హత్తుకుని ప్రాణాలు వదిలేసిన కుమారుడు
- బంటుపల్లి యూబీ పరిశ్రమ ఎదుట ఘటన



మృతుడు కరణం రామకృష్ణ (ఫైల్)



మృతుడు కిరణ్ కుమార్ (ఫైల్)

రణస్థలం: తండ్రీ కొడుకులను మృత్యు దేవత మింగేసింది. ఇంటి ఆడబిడ్డను చూసి వస్తుండగా దారి కాచి మరీ దాడి చేసింది. మండలంలోని బంటుపల్లి యూబీ పరిశ్రమ ఎదుట జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రికొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. జేఆర్ పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..

విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలంలోని ఉప్పర నాయుడు వలసకు చెందిన తండ్రీకొడుకులు కరణం రామకృష్ణ(52), కరణం కిరణ్ కుమార్(20)లు ఆదివారం భోగాపురం మండలంలో గల మిరాకిల్ కళాశాలలో చదువుతున్న కిరణ్ చెల్లి సాత్వికను చూసేందుకు స్వగ్రామం నుంచి బైక్‌పై బయల్దేరారు. ఇటీవల రాఖీ పండగకు చెల్లి రాలేకపోవడంతో ఆమెను చూసేందుకు ఇద్దరూ బయల్దేరారు. ఆడబిడ్డను చూసి తిరుగు ప్రయాణమయ్యారు. మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో యూబీ పరిశ్రమ ఎదుట హైవేపై వెళ్తుండగా వీరి బండిని లారీ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న తండ్రి కరణం రామకృష్ణ, కుమారుడు కరణం కిరణ్ కుమార్(20) అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరిలో ఎవరూ హెల్మెట్ పెట్టుకోలేదు. హెల్మెట్‌ను బైక్‌కు తగిలించి ఉండడం గమనార్హం. అయితే ప్రమాదం నిర్దిష్టంగా ఎలా జరిగిందో పోలీసులు అంచనా వేయలేకపోతున్నారు. లారీ ఢీకొట్టాక తండ్రీకొడుకులు ద్విచక్రవాహనంపై కూర్చొని పక్కకు ఒరిగిపోయినట్లు పడిపోయారు. ఇద్దరి తలలు రోడ్డుకు బలంగా తగలడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశారు. తండ్రిని కొడుకు హత్తుకుని నడిరోడ్డుపై విగతజీవుల్లా ఉన్న దృశ్యం అక్కడున్న వారిచేత కంట తడి పెట్టించింది. మృతుడు కిరణ్‌కుమార్ విజయనగరంలోని సీతం కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తల్లి రాణిరత్నం అంగన్‌వాడీ టీచర్. ఈ ప్రమాదంపై జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సిగ్గుతో తలదించుకునే పరిస్థితి



కోల్‌కత్తాలో మహిళా వైద్యురాలిపై అత్యాచారం, హత్యతో సమాజం మొత్తం తలదించుకునే పరిస్థితి ఎదురైంది. మహిళల భద్రత, ప్రాణాలు కాపాడే వైద్యుల భద్రత రెండు అంశాలు కీలకంగా మా రాయి. ప్రత్యేక చట్టాలు సమర్థంగా అమలు చేయడం అవసరం. శాసన కార్యనిర్వాహక వ్యవస్థలు ప్రత్యేక దృష్టి పెట్టాలి.

– డాక్టర్ గంగా ప్రియదర్శిని, ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్

ఎవర్నీ విడిచిపెట్టకూడదు..



మహిళా వైద్యులు, సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించే వారిని చట్టపరంగా శిక్షించాలి. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కొన్నిసార్లు అవగాహన లేని వారి నుంచి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కోల్‌కత్తా ఘటన నేపథ్యంలో ఇలాంటి మహిళా వైద్యులు, మహిళా వైద్య సిబ్బందిపై ఒక కమిటీ వేసి అవసరమైన రక్షణ చర్యలు కల్పించాలి. – బి.వర్షిత, వైద్యాధికారి, మతంసరియాపల్లి



నైట్ వాచ్‌మెన్‌లు ఉండాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలు పని చేస్తున్నాయి. జనరల్ సమయంలో వైద్య సేవలు బాగానే అందిస్తున్నాం. నైట్ విధుల్లో స్టాఫ్ నర్సులు, నర్సులు ఉన్నా వాచ్‌మెన్ లేకపోవడం ఇబ్బంది ఉంటోంది. అందుకే మా ఖర్చుతో మేమే ఆ ఏర్పాటు చేసుకున్నాం. ప్రజా సేవ చేసే వైద్యులకు ప్రభుత్వమే సంపూర్ణ భద్రత కల్పించాలి.

– యమున, రావాడ పీహెచ్‌సీ డాక్టర్



క్లుప్తంగా

అరసవల్లి ఈఓగా రమేష్‌బాబు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి ఆలయ ఈఓగా డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు రెగ్యులర్ బాధ్యతలను ఆదివారం సాయంత్రం చేపట్టారు. ఇటీవల దేవదాయ శాఖ బదిలీల ప్రక్రియలో భాగంగా వర్కింగ్ అరేంజ్‌మెంట్స్‌ను రద్దు చేసిన నేపథ్యంలో ఇంత వరకు ఇదే విధానంలో ఈఓగా విధులు నిర్వర్తించిన ఎస్.చంద్రశేఖర్ తిరిగి అన్నవరంలో డిప్యూటీ ఈఓగా వెళ్లిపోవాల్సి వచ్చింది. అలాగే అరసవల్లి ఆలయ ఈఓగా రెగ్యులర్ డీసీగా ఉంటూ అన్నవరంలో వర్కింగ్ అరేంజ్‌మెంట్స్‌పై పనిచేస్తున్న రమేష్‌బాబు కూడా తిరిగి ఇక్కడే రెగ్యులర్ విధులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదిత్యుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలతో పాటు వేదాశీర్వచనాన్ని అందజేశారు.

డాక్టర్ ముత్యంకు ఘనంగా నివాళి



డాక్టర్ ముత్యంకు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: పలాస మండలం బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం శ్రీకాకుళం ఉద్యమం సాహిత్య పరిశోధక రచయిత, బహుగ్రంథ కర్త డాక్టరు ముత్యం సంతాప సభ నిర్వహించారు. ఇటీవల హైదరాబాద్‌లోని తన స్వగృహంలో డాక్టరు ముత్యం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. శ్రీకాకుళం జిల్లాతోను, ముఖ్యంగా ఉద్దానం ప్రాంతంతోను ఆయనకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువు వక్తలు మాట్లాడుతూ ముత్యం ఘనతలను గుర్తు చేసుకున్నారు.

గెడ్డలో పడి వ్యక్తి మృతి



దండుగెడ్డలో పడి మృతి చెందిన దీనబందు

ఇచ్ఛాపురం రూరల్: మండలం ఇన్నేశుపేట గ్రామంలోని దండుగెడ్డలో పడి ఈదుపురం గ్రామానికి చెందిన గాలి దీనబందు (57) మృతి చెందినట్లు పోలీసులు కనుగొన్నారు. దీనబందు శనివారం సాయంత్రం బయటకు వెళ్లి ఇంటికి రాలేదని, ఆదివారం ఉదయం దండుగెడ్డలో శవమై తేలాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని నీటి నుంచి మృతదేహాన్ని బయటకు తీసి శవ పంచనామాకు ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. నడక దారిన వెళ్తూ ప్రమాదవశాత్తు కాలుజారి గెడ్డలో పడి మృతి చెంది ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య చంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు హిందీ మంచ్, ఇంటలెక్చువల్స్ ఫోరం కార్యవర్గ సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: హిందీ మంచ్ సంస్థ, ఏపీ ఇంటలెక్చువల్స్ ఫోరం సంస్థల కార్యవర్గ సమావేశాలను సోమవారం నిర్వహిస్తున్నట్టు హిందీ మంచ్ అధ్యక్షులు దొంతం పార్వతీశం, ఇంటలెక్చువల్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి పాట్నూరు వెంకటరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశారు. రెండు సంస్థల సమావేశాలు సోమవారం ఉదయం 9 నుంచి 11 మధ్య శ్రీకాకుళం నగరంలోని గూనపాలెంలో ఉన్న శాంతినికేతన్ జూనియర్ కాలేజీలో నిర్వహించనున్నట్టు చెప్పారు.

నో స్టాక్

- అంగూరు స్టాక్ పాయింట్‌లో ముగిసిన అమ్మకాలు
- టెక్కలిలో గత నెలలో ముగిసిన ఇసుక అమ్మకాలు
- పలు చోట్ల అక్రమ నిల్వలతో దళారులకు కాసుల పంట



ఖాళీ అయిన అంగూరు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద రెవెన్యూ, మైన్స్ సిబ్బంది

టెక్కలి: జిల్లాలో ఇసుకకు నో స్టాక్ బోర్డు పడింది. అందరికీ సాధారణ ధరలో ఇంటి వద్దకే ఇసుక అందాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన ఇసుక విధానాన్ని తప్పు పడుతూ... కూటమి ప్రభుత్వం ఉచితం అనే పేరుతో ఎన్నికల హామీగా ప్రజలకు గాలం వేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుకను ఖరీదైన వస్తువుగా మార్చేశారు. జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టెక్కలి, కొత్తూరు మండలం అంగూరులో ఉన్న స్టాక్ పాయింట్‌లో నిల్వ చేసిన ఇసుకను కూటమి ప్రభుత్వం జూలై నెలలో అమ్మకాలు ప్రారంభించింది. జూలై 26తో టెక్కలిలో ఇసుక అమ్మకాలు పూర్తి కాగా, ఆ తర్వాత ఒక్క అంగూరు స్టాక్ పాయింట్‌లో మాత్రమే ఇసుకను అమ్మకాలు చేశారు. ఇప్పుడు అంగూరు వద్ద స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుక అమ్మకాలు ఆదివారంతో ముగిశాయి. దీంతో జిల్లాలో ఇకపై ఇసుక కొరత మరింత తీవ్రం కానుంది. గత రెండు నెలలుగా ఇదే స్టాక్ పాయింట్ నుంచి కొంత మంది దళారులు తరలించిన ఇసుక కొన్ని చోట్ల అక్రమంగా నిల్వ చేశారు. ఇప్పుడు వారికి కాసుల పంట పండనుంది. ఇసుక అక్రమ నిల్వలపై అధికారులు సైతం కనీసం దృష్టి సారించకపోవడంతో దళారులు చెప్పిందే ధరగా ఇసుక అమ్మకాల్లో బిజీగా మారారు. మరో వైపు నది పరివాహక ప్రాంతాల్లో ఇప్పటికే అక్రమంగా ఇసుక తరలింపులు చేస్తున్నారు. గత ప్రభుత్వం వరకు సాధారణ ధరలకే ఇంటి వద్దకే లభ్యమైన ఇసుక ఈ రోజు ఉచితం మాటున ఖరీదు వస్తువుగా మారడమే కాకుండా తీవ్రమైన కొరత ఏర్పడుతోంది. అధికార పార్టీ నేతల కోసమే ఉచితం ఇసుక పాలసీ అమలు చేశారనే విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.



టెక్కలిలో ఇసుక లేక ఖాళీగా ఉన్న స్టాక్ పాయింట్

అంగూరు ఇసుక స్టాక్ పాయింట్‌లో విక్రయాలు పూర్తి

కొత్తూరు: కొత్తూరు మండలం అంగూరు గ్రామం వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ వద్ద విక్రయాలు పూర్తయ్యాయి. స్టాక్ పాయింట్‌ను జూలై 8వ తేదీన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. 47 రోజుల పాటు 25,945 టన్నుల ఇసుకను విక్రయించినట్లు అధికారులు చెప్పారు. జిల్లాలో టెక్కలి, కొత్తూరు మండలంలోని అంగూరు గ్రామం వద్ద ఇసుక స్టాక్ పాయింట్లు ఉండేవి. రెండు పాయింట్ల వద్ద ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణదారులకు ఇబ్బందులు తప్పకపోవచ్చు. పాయింట్‌లోకి ఎలాంటి వాహనాలు వెళ్లకుండా మైన్స్, రెవెన్యూ అధికారులు ట్రెంచ్‌లు తవ్వించారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి సన్నిధిలో శ్రావణ ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వివాహాది శుభకార్యక్రమాలు జరిగిన క్రమంలో నూతన దంపతులకు తొలిసారిగా ప్రత్యేక దర్శనాలకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



అన్నదాన ప్రసాదానికి క్యూలో భక్తులు

జిల్లా కబడ్డీ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక



జిల్లా నూతన కబడ్డీ సంఘ నూతన కార్యవర్గం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కబడ్డీ సంఘం, శ్రీకాకుళం నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం శ్రీకాకుళం నగరంలోని డీఈఓ కార్యాలయం సమీపంలో ఉన్న జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాయంలో జిల్లా కబడ్డీ సంఘ కార్యవర్గ సమావేశంతో పాటు నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ముందుకు తయారుచేసిన కార్యవర్గాన్ని చదివి వినిపించి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రకటించారు. జిల్లా కబడ్డీ సంఘానికి చైర్మన్‌గా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను నియమించుకున్నారు. మిగిలిన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతు జిల్లాలో కబడ్డీ క్రీడాభివృద్ధికి సమష్టిగా పనిచేసి, పూర్వ వైభవాన్ని తీసుకొద్దామన్నారు.

నూతన కార్యవర్గం ఇదే

జిల్లా కబడ్డీ సంఘ శ్రీకాకుళం చైర్మన్‌గా గొండు శంకర్, అధ్యక్షుడిగా నక్క కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా సాదు ముసలినాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శిగా సాదు శ్రీనివాసరావు, కోశాధికారిగా నాగళ్ల రమేష్, ఉపాధ్యక్షులుగా ఎం.సాయికుమార్, జి.యమునరాణి, ఆర్.లక్ష్మీనాయుడు, సంయుక్త కార్యదర్శులుగా డి.తవిటమ్మ, ఎస్.కోటేశ్వరరావు, ఎం.తిరుపతిరావు, జె.నారాయణ, ఎస్.రమేష్, కె.రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నాలుగు దశాబ్దాల తర్వాత..



శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ట్రైనింగ్ స్కూల్) లో చదువుకున్న 1984 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు చిన్నబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం మళ్లీ కలుసుకున్నారు. ఆనాటి తీపి గుర్తులు జ్ఞప్తికి తెచ్చుకుని ఆనాటి గురువులను సత్కరించారు.

– శ్రీకాకుళం కల్చరల్

పలాస తప్పెటగుళ్లకు సినిమా చాన్స్



హైదరాబాద్ షూటింగ్‌లో సాయిపల్లవితో తప్పెటగుళ్ల బృందం

కాశీబుగ్గ: ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతిగాంచిన తప్పెటగుళ్ల కళాకారులకు తండేల్ సినిమాలో అవకాశం దక్కింది. ఓ పాటకు నృత్యం చేసే అవకాశాన్ని పలాస మండలం రేగులపాడుకు చెందిన పీత గంగయ్య తప్పెటగుళ్ల బృందం దక్కించుకుంది. సినీ నటి సాయిపల్లవి, సంగీత దర్శకుడు డీఎస్పీ, డ్యాన్స్‌మాస్టర్ శేఖర్, సినీ నిర్మాతల ప్రోత్సాహం బాగుందని, సంతోషంగా ఉందని వారు తెలిపారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు

- పీఆర్‌టీయూ భవన ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: సమ సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని, తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులదేనని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని అరసవల్లి ఆలయం సమీపంలో ప్రోగ్రెసివ్ రిక్గనైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) జిల్లాశాఖ నూతన భవనాన్ని ఆదివారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ పెడదారి పడుతున్న నేటి యువతను సన్మార్గంలో నడిపించేలా చూడాలని ఆమె కోరారు. అనంతరం ఆమెను కేంద్రమంత్రి, ఎమ్మెల్యే చేతులమీదుగా అతిథులు సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు మాట్లాడుతూ విద్యాశాఖలో తరచూ తలెత్తే వివిధ సమస్యలను పరిష్కరించేందుకు, గ్రీవెన్సులపై దృష్టిసారించేందుకు విద్యాశాఖకు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు మధ్య ఓ అనుసంధాన కర్తను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తారనే చంద్రబాబుకు, వారి కూటమికి ఉపాధ్యాయులంతా ఏకతాటిగా మద్దతు తెలిపారని గాదె పేర్కొన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, పీఆర్‌సీని ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట కృష్ణయ్య, గౌరవాధ్యక్షులు భైరి అప్పారావు, జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహనరావు తదితరులు మాట్లాడుతు విద్యా, ఉపాధ్యాయ పక్షాన పీఆర్‌టీయూ సంఘం చేస్తున్న పోరాటాలు, కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఏఎం గిరిప్రసాద్, డి.గోపీనాథ్‌రెడ్డి, జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు తంగి మురళీమోహనరావు, కార్యదర్శి దానేటి కేశవరావు, జిల్లా గౌరవాధ్యక్షులు జె.బాబూరావు, పప్పల రాజశేఖరరావు, జి.యోగానంద్, ఎంపీఎం దాసు, అరసవల్లి అప్పారావు, బసవరాజు, హరిశ్చంద్రుడు, శరత్‌బాబు, ప్రదీప్, విశ్రాంత డీఈఓ బి.మల్లేశ్వరరావు, డీవైఈఓ ఆర్.విజయకుమారి, పీఆర్‌టీయూ వివిధ జిల్లాల ప్రతినిధులు, జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి పీఆర్‌టీయూ భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి

తిలక్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం



నందిగాం సర్వీస్ రోడ్‌లో రాంగ్‌రూట్‌లో ఆటో రావడంతో ప్రమాదానికి గురైన వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి తిలక్ వాహనం

టెక్కలి: వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. తిలక్‌తో పాటు మండల నాయకులు ఆదివారం శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో కణితూరు గ్రామానికి చెందిన బండారు చాణుక్య అనే వ్యక్తిని పరామర్శించి తిరిగి వాహనంలో వస్తుండగా నందిగాం సర్వీస్ రోడ్‌లో ఫ్లై ఓవర్ వద్ద ఎదురుగా రాంగ్ రూట్‌లో హటాత్తుగా ఓ ఆటో రావడంతో దాన్ని తప్పించబోయి ఢీకొన్నారు. ప్రమాదంలో నందిగాం మండలం బెజ్జిపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పొందర తేజారావు, ఆయన భార్య అరుణకుమారికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే 108కు సమాచారం ఇచ్చినప్పటికీ వాహనం అందుబాటులో లేకపోవడంతో సమీపంలో ఉన్న ఎన్‌హెచ్16 వాహనంలో క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిపై తిలక్ ప్రత్యేకంగా పర్యవేక్షణ చేసి వైద్య సేవలపై ఆరా తీశారు. మంత్రి అచ్చెన్నాయుడు కూడా ఘటనపై ఆరా తీశారు. నందిగాం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి



బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్ అని బీసీ సంఘ నాయకులు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని జ్యోతిరావుపూలే పార్కులో బీపీ మండల్ జయంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు శ్రీకాకుళం జిల్లా బీసీ సంఘాల అధ్యక్షులు అమీరుల్లా బేగ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, అధ్యక్షులు బాడాన దేవభూషణ్, అంబేడ్కర్ సలహామండలి సభ్యులు బీసీ నాయకులు రాజేష్, ఎంబీసీ ఉత్తరాంధ్ర సెక్రెటరీ రౌతు శంకరరావు, ఎంబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు అలపాన త్రినాథ్ రెడ్డి, జంగం సంఘం నాయకులు నాగరాజు, యాదవ సంఘం నాయకులు కాయితి వెంకటరమణ, ఎంబీసీ నాయకులు కృష్ణంరాజు, పద్మశాలి సంఘ నాయకులు, కుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

అమర జవాన్ స్థూపం నిర్మించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో అమర జవాన్ స్థూపం ఏర్పాటు చేయాలని జిల్లా మాజీ సైనిక సమాఖ్య అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం నగరంలోని పెద్దరెల్లివీధిలోని తమ కమ్యూనిటీ హాల్‌లో మాజీ సైనికులు, వీరనారులు, కటుంబ సభ్యులతో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో పూర్ణచంద్రరావుతో పాటు శ్రీకాకుళం జిల్లా చైర్మన్ కెప్టెన్ పి.ఈశ్వరరావు(రిటైర్డ్), ఎల్.ఎల్.రావు, వి.సూర్యనారాయణ, ఎస్.రామకృష్ణ, తదితరులు మాట్లాడారు. మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇటీవల వీర మరణం పొందిన జిల్లా సైనికులను స్మరించుకుంటూ కొద్ది సేపు మౌనం పాటించారు. ఇటీవల విజయవాడలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మాజీ సైనికుల కవాతులో మన జిల్లా నుంచి పాల్గొన్న హవాల్దార్ ఇ.రాజారావు(రిటైర్డ్)ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సమాఖ్య ట్రెజరర్ ఎమ్.సింహాచలం, జి.అమ్మన్నమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేతనం కోసం ఎదురు చూపు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వేతనం కోసం ఎదురు చూస్తున్నారు. వర్సిటీలో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఆప్కాస్ గుర్తింపు సంస్థ ఏజీఎస్ మేనేజ్ మెంట్‌తో ఒప్పందం కుదుర్చుకుని ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన వీరిని నియమించారు. మొత్తం 10 కేటగిరీల్లో ఈ పోస్టులు నియమించారు. రూ. 18500 కేటగిరీలో క్లరికల్ అసిస్టెంట్‌లు మూడు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ ఆరు, డ్రైవర్లు రెండు, ఎలక్ట్రీషియన్/ప్లంబర్‌లు 3, స్టోర్ కీపర్ ఒకటి, హాస్టల్ సూపర్ వైజర్ ఒకటి, హాస్టర్ కేర్ టేకర్ ఒకటి, రూ. 15000 వేతనం కేటగిరిలో ఆఫీస్ సబార్డినేట్లు ఏడు, సెక్యూరిటీ గార్డులు ఐదు, ల్యాబ్ అటెండెంట్‌లు ఐదు పోస్టుల్లో నియమించారు. వీరిని నియమించిన జనవరి 1 నుంచి ఇప్పటి వరకు వేతనం ఇవ్వలేదు. ఒక ప్రభుత్వ స్వతంత్ర్య సంస్థ విశ్వవిద్యాలయంలో ఎనిమిది నెలలు వేతన బకాయిలు ఉండటం విమర్శలకు తావిస్తుంది. వీరి నియామకాలు వీసీ నిమ్మ వెంకటరావు టెర్మ్‌లో సాగాయి. ఆయన జనవరి 18న రిలీవ్ అయ్యారు. 23న కొత్త వీసీగా కేఆర్ రజిని వచ్చారు. ఇన్నాళ్లు వీరితో పని చేయించుకున్నారు కానీ వేతనం మాటెత్తడం లేదు.

ప్రస్తుతానికి వీరంతా సొంత ఖర్చులతో విధులకు హాజరవుతున్నారు. మరో పక్క వీరి నియామకం తర్వాత ముగ్గురు డ్రైవర్లు, ఇద్దరు విశ్రాంత ఉద్యోగులను, ఇద్దరు స్కావెంజర్స్, 22 కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించారు. వీరికి మాత్రం ప్రతి నెల వేతనం ఇస్తున్నారు. గత వీసీ టెర్మ్‌లో నియామకాలు కావటం వల్లనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వటం లేదు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి వర్సిటీ వేతనం చెల్లించగా, వారి కమిషన్ మినహాయించి ఉద్యోగులకు వారి ఖాతాల్లో జమచేయాలి. కార్మిక చట్టాలు వేజ్ బోర్డు మేరకు కనీసం 100 రోజుల పనిచేసిన తర్వాత వేతన బకాయిలు ఉండకూడదు. ప్రస్తుతం ఈ చట్ట ఉల్లంఘన వర్సిటీలో జరుగుతోంది. మరో పక్క వారి తొలగింపునకు సైతం అధికారులు రాజకీయ సిఫార్సులతో ముందుకు సాగుతున్నారు. పాలక మండలి అనుమతులతో నియామకాలు జరగటం వల్ల మళ్లీ పాలక మండలిలో తొలగింపు అంశం అజెండాగా పెట్టి తొలగింపుకు చర్యలు తీసుకునేందుకు కసరత్తులు చేసున్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఉద్యోగ భద్రత కోసం ఆందోళన చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు (ఫైల్)



మంత్రి అచ్చెన్నాయుడుకి తమ సమస్య వివరిస్తున్న వర్సిటీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

జీతాలు చెల్లించాలని వినతి..

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమకు ఎనిమిది నెలలగా వేతనాలు చెల్లించటం లేదని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకు వెళ్లారు.

నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రిని ఆదివారం కలిసి సమస్య చెప్పారు. అయితే మంత్రి మాత్రం విశ్వవిద్యాలయానికి స్వయం ప్రతిపత్తి ఉంటుందని, వీసీ, రిజిస్ట్రార్‌లకు మాత్రమే వేతనం చెల్లించే అధికారం ఉంటుందని చెప్పినట్లు సమాచారం.